క్లుప్తంగా

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వామికి సహస్రనామార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే లలిత కుమారి



అప్పన్న ఆలయంలో ఎమ్మెల్యే లలితకుమారి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

విశాఖ ఉక్కుకు ఊపిరివ్వండి

- స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు



హెచ్ఎంఎస్ సమావేశంలో మాట్లాడుతున్న దొమ్మేటి అప్పారావు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు తీవ్రమైన సంక్షోభంలో ఉందని, కేంద్ర ప్రభుత్వం కావాలనే ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోందని స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాలు అమలు చేయడం లేదని, అదీగాక ప్రతి నెలా సమయానికి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చత్తీస్‌ఘడ్‌లో సోమవారం నిర్వహించిన స్టీల్ మెటల్ అండ్ ఇంజినీరింగ్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిస్థితిపై మెటల్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్పందించి ఉక్కు మంత్రికి పరిస్థితిని విన్నవించాలని, ఉక్కుకు ఊపిరివ్వాలని కోరారు. అలాగే స్టీల్ ప్లాంట్ సీఎండీకి కూడా ఒక లెటర్ రాయాలన్నారు. సెయిల్ మాదిరిగానే విశాఖ ఉక్కులో కూడా అన్ని బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. స్పందించిన మెటల్ ఫెడరేషన్ ప్రతినిధులు ఈ విషయాన్ని ఉక్కు మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అవసరమైతే విశాఖ ఉక్కు సీఎండీని కలిసి మాట్లాడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎన్‌జేసీఎస్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ సింగ్, సచ్చేంద్ర నాయక్, స్టీల్ మెటల్ అండ్ ఇంజినీర్ ఫెడరేషన్ అధ్యక్షుడు త్యాగి, కార్యదర్శి సంజోట్ వాడేకర్, హెచ్ఎస్ మిత్ర, లాల్, సుకాంత్ పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీతామాణిక్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య కె.సీతామాణిక్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.విజయలక్ష్మి నుంచి ఆమె ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీతామాణిక్యంకు న్యాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు అభినందనలు తెలిపారు.

భయం.. భయం

కలవర పెడుతున్న వంతెనలు



ఊటగెడ్డ కూడలికి సమీపంలో వంతెనపై దెబ్బతిన్న రెయిలింగ్



రక్షణ గోడలు కూలిన ముత్యాలమ్మపాలెం వంతెన

పరవాడ: మండలంలోని పలు మార్గాల్లో కాలువలపై నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దీంతో బిక్కు బిక్కుమంటూ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా పరవాడ–యలమంచిలి రహదారిలో ఊటగెడ్డ కూడలికి సమీపంలో నిర్మించిన రెండు వంతెనలపై రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ఈ రోడ్డులో వీధి దీపాలు లేక రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు రక్షణ గోడలను ఢీ కొట్టడడం వల్ల అవి కూలిపోయాయి. ఈ రోడ్డులో ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. విధులు ముగించుకొని వచ్చే క్రమంలో రక్షణ గోడలు లేని వంతెనల వద్ద భయాందోళన చెందుతున్నారు. రోడ్డు పొడవునా లైట్లు లేకపోయినా దెబ్బతిన్న వంతెనల వద్ద ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. వంతెనల రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

- మండల కాంప్లెక్సు కూడలి వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టు రక్షణ గోడలు కూలిపోయాయి. లంకెలపాలెం, సబ్బవరం, గాజువాక ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఆటోలు, బస్సుల కోసం ఈ కల్వర్టు వద్ద వేచి ఉంటారు.
- వెలుగు కార్యాలయం సమీపంలో నిర్మించిన కల్వర్టు కూడా ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.
- ముత్యాలమ్మపాలెంలోని ముత్యమాంబ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వంతెన కూడా ప్రయాణికులను భయపెడుతుంది. చేసిన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. మత్స్య సంపదను తరలించే భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు లెక్కకు మించి రాకపోకలు సాగిస్తున్నాయి. రక్షణ గోడలు దెబ్బతినడం వల్ల ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నమోశివ రుద్రాయ



ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం భక్తుల తో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కాలుష్య రహిత ప్రాంతంగా ఆటోనగర్



ఆటోనగర్ ఎఫ్‌–బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను కాలుష్యరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఏడీ చంద్రమౌళి కోరారు. ఆటోనగర్ ఎఫ్‌– బ్లాక్‌లో ఎంఎస్ఎంఈ, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో ప్రతీ పారిశ్రామిక వేత్త ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ అధికారులు, సిబ్బంది, వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఐలా సిబ్బంది స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్‌–బ్లాక్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆటోనగర్ వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండు రంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఏడీ ఎఫ్‌–బ్లాక్‌లో పలు పరిశ్రమల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, ఏడీలు శ్రీను, మూర్తి, రెడ్డి, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి పర్వారి ప్రభాకర్, కేవీఎస్ రాజు, రెడ్డి, కృష్ణ ప్రసాద్, ప్రశాంత్, నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి నక్షత్ర హారతి

- షీలానగర్‌లోని ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు
- కనులపండువగా మెట్ల పూజ



నక్షత్ర హారతి అందుకుంటున్న స్వామి అయ్యప్ప



ఆలయంలో 18 మెట్లకు చేపట్టిన దీపాలంకరణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 34వ పవిత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సోమవారం నక్షత్ర హారతి నిర్వహించారు. ఆలయంలో కొలువైయున్న గణపతి స్వామికి, కుమార స్వామికి, ఈశ్వరునికి, పార్వతీ దేవి ఆలయాలకు దీపాలంకరణ చేపట్టారు. దేవతలకు హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణ ఆధ్వర్యంలో ఆలయంలో భజన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆరాట్టు, జెండా అవరోహణ జరగనున్నట్లు అయ్యప్ప దేవాలయ సమితి అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు తెలిపారు.

బోసిపోయిన దువ్వాడ రైల్వేస్టేషన్

ప్రధాన రైళ్ల రద్దుతో ప్రయాణికులు రాక వెలవెల



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫామ్‌లు

అగనంపూడి: విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల మధ్య నడుస్తున్న జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు రాక దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు సోమవారం బోసిపోయాయి. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల్లో అధిక శాతం మంది ఈ మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల మీదే ఆధారపడి ఉన్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేసే 24 జతల రైళ్ల ద్వారా ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారో ఈ మూడు రైళ్ల ద్వారా అంతమంది ప్రయాణం చేస్తారు. అలాంటి కీలకమైన రైళ్లన్నీ రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కుంటున్నారు. దీంతో రైల్వేస్టేషన్ బోసిపోయింది. ఈ మూడు రైళ్లు రద్దు కావడంతో వందలాది మంది డైలీ పాసింజర్లు కూడా ఇబ్బంది పడుతూ రోడ్డు రవాణా మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

మెగా జాబ్‌డ్రైవ్‌లో 172 మంది ఎంపిక

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్), నిర్మాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎన్ఆర్‌సీ అండ్ జేకేసీ విభాగం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించింది. ఎన్ఆర్‌సీ అనుబంధ 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 436 మంది విద్యార్థులు పాల్గొనగా.. 172 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అభ్యర్థులు వారిలోని నైపుణ్యాలు పెంపొందించుకుని, ఇంటర్వ్యూను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి



అప్పన్న ఆలయంలో ఎస్‌పీఎఫ్ అటెండెన్స్ రికార్డ్స్ పరిశీలిస్తున్న కమాండెంట్ నరసింహారావు

సింహాచలం: ఆలయాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్‌పీఎఫ్ రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ కె.నరసింహారావు అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలో విధులు నిర్వహించే ఎస్‌పీఎఫ్ సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఆలయంలో భద్రత కోసం ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఏమేరకు అవసరమో, ఏయే భద్రతా పరికరాలు ఉండాలో ఇప్పటికే దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారుల నుంచి సానుకూలస్పందన లభించిందని తెలిపారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు.

అన్నప్రసాద పథకానికి రూ.10 లక్షల విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి విజయవాడలోని కరెన్సీ నగర్‌కు చెందిన కేతినేని రత్నాకరరావు రూ. 10 లక్షలు అందజేశారు. సంబంధిత చెక్కును దేవస్థానానికి పంపించారు. చెక్కు క్లియరెన్స్ కావడంతో దాతకు బాండ్ త్వరలోనే అందజేస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, కార్మికులు

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 549 ప్రకారం కార్మికులకు రూ.16 వేల జీతం అమలు చేయాలని, వివిధ కటింగ్‌లు చూపిస్తూ రూ.11,200 మాత్రమే చెల్లిస్తున్నారని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. త్వరలో ఈ కాంట్రాక్టు ముగుస్తుందని, కాంట్రాక్టు ముగిసే సమయానికి బకాయిలు లేకుండా జీతాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో పీఎఫ్ కట్టలేదని అడిగినందుకు ఆర్.ఆదిలక్ష్మిని సంబంధిత కాంట్రాక్టర్ అన్యాయంగా తొలగించారని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.కనకరాజు, డి.రాజేశ్వరి, డి.భాగ్య, కేశవరావు, పోతురాజు, పి.రాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'నిలిపివేసిన పనులు వెంటనే ప్రారంభించాలి'



ధర్నాలో ప్రసంగిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కొన్ని విభాగాల్లో నిలిపివేసిన పనులను వెంటనే ప్రారంభించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ భవనం వద్ద సోమవారం ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ సీఎంఎస్‌లో గత 7 నెలలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు నిలిచి పోయాయన్నారు. అదే విధంగా బీఎఫ్, ఆర్ఎంహెచ్‌పీ, సీఈడీ విభాగాల్లో గత రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయన్నారు. దీని వల్ల సుమారు 100 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఈ పరిస్థితికి కారణం యాజమాన్యం నిర్లక్ష్యమేనని ఆరోపించారు. పనులు ప్రారంభించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓ.వి.రావు, నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, వి.వి.రమణ, నారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీతా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను పునరుద్ధరించాలి



అప్పన్న ఆలయంలో చిలకపాటి విజయరాఘవాచార్యులు, గుమ్మలూరి రాంబాబు

సింహాచలం: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సీతా(స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్)ను, హిందూ పరిరక్షణ ట్రస్ట్‌ను పునరుద్ధరించాలని ఆసంస్థ మాజీ డైరెక్టర్ చిలకపాటి విజయరాఘవాచార్యులు, ప్రతినిధి గుమ్మలూరి రాంబాబు సూచించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం వారు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అన్యమతం విస్తరించకుండా, సనాతన ధర్మాన్ని కాపాడటానికి రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ధార్మిక పరిషత్, సీతా ఆధ్వర్యంలో టెంపుల్స్‌లో పనిచేసే సిబ్బందితో పాటు వైదికులకు శిక్షణ ఇచ్చేదన్నారు. గత ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. ట్రైన్, ఫ్లైట్, రోడ్డు రవాణా కనెక్టివిటీ ఉన్న విశాఖలో ఏర్పాటు చేయడం వల్ల అన్ని ఆలయాల సిబ్బందికి అందుబాటులో ఉంటుందని సూచించారు.

నూతన కార్యవర్గానికి అభినందన



బంగారునాయుడును అభినందిస్తున్న గ్రామ పెద్దలు, సొసైటీ డైరెక్టర్లు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ విశాఖ డెయిరీ పాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా మామిడి బంగారునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని పాలసొసైటీ వద్ద సోమవారం పాల సొసైటీ అధ్యక్షుడు సండ్రాన అప్పారావు అధ్యక్షతన పాలకవర్గ సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బంగారునాయుడును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం,అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పెదనాయుడుపాలెం పాల సొసైటీ అధ్యక్షుడు సబ్బవరపు సత్యనారాయణ,అమృతపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు చీపురుబిల్లి సూర్యనారాయణ,ఇరువాడ గ్రామ పెద్దలు మచ్చ కోటేశ్వరరావుతో పాటు పాల సొసైటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్



కూలడానికి సిద్ధంగా ఉన్న కలపాక బస్‌షెల్టర్

పరవాడ: మండలంలోని కలపాకలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ నేడో రేపో కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ షెల్టర్ ఆలనా పాలన చూసే నాథుడు లేక శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు నిరీక్షించడానికి నీడ లేక అవస్థలు పడుతున్నారు. బస్సులు, ఆటోల కోసం వచ్చే ప్రయాణికులు షెల్టర్‌లో కూర్చోవడానికి భయపడుతున్నారు. ఎండైనా వానైనా ఆరు బయట వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు. శిథిలమైన బస్ షెల్టరును తొలగించి ఆ స్థానంలో నూతన బస్ షెల్టరు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

శివుని ప్రతిరూపమే శంకరాచార్యులు



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కుర్తాళం శంకరాచార్యులు, పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ప్రవచనం చేశారు. జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శంకరాచార్యులు సాక్షాత్ శివుడి అవతారమని, శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్రవాఙ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శంకరుల జీవితంలోని పలు సంఘటనలు, ఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, అశేష భక్తజనం స్వామి వారి భాషణాన్ని ఆలకించి పులకించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజా రవాణాను వాడుదాం..



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించవచ్చునని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. వారు మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించి, కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.